నమస్తే తెలంగాణ
జగిత్యాల
5 | కరీంనగర్, ఆదివారం 10 మార్చి 2024 | JAGTIAL

## ఎట్లుండె వీర్నపల్లి.. నేడు ఎట్లయింది?

ఒకప్పుడు వీర్నపల్లి ఎట్లుండెనని.. నేడు ఎట్లయిందని, నాడు ఎల్లారెడ్డిపేట మండలంలో ఒక గ్రామంగా ఉండేదని, స్వరాష్ట్రంలో మండల కేంద్రంగా అభివృద్ధి చెందిందని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో వీర్నపల్లి మండలంలోని 10 తండాలు గ్రామ పంచాయతీలుగా ఏర్పడ్డాయని చెప్పారు. పదేండ్ల పాలనలో వీర్నపల్లిలో ₹5 కోట్లతో పాఠశాల అభివృద్ధి అయిందని, రైతు వేదికతోపాటు పలు అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. కాంగ్రెస్ పాలనలో కష్టాలు ప్రారంభమయ్యాయని, వీర్నపల్లి మండలంలో పంటలు ఎండిపోతున్నాయని, కరెంటు కోతలు మొదలయ్యాయని ఆవేదన చెందారు. గత వానకాలంలో రాష్ట్రంలో 14 శాతం అధిక వర్షపాతం నమోదైందని, అలాంటప్పుడు వేసవి రాక ముందే కరువు చాయలు ఏర్పడడానికి కాంగ్రెస్ పాలనే కారణమని మండిపడ్డారు.





మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకులు తల ఉమ, దరువు ఎల్లన్న, తదితరులు

# మళ్లీ మోసపోవద్దు



వీర్నపల్లిలో జై కొడుతున్న నాయకులు, కార్యకర్తలు

'గత అసెంబ్లీ ఫలితాలకు సమాధానం చెప్పే సమయం ఆసన్నమైంది. అప్పుడు చేసిన తప్పిదాన్ని తిప్పికొడుదాం. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తిరుగులేని విధంగా సత్తా చాటుదాం. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్‌ను పక్కలో బల్లెంలా మారుద్దాం. వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం. అందుకోసం మనమంతా సైనికుల్లా కష్టపడుదాం' అని బీఆర్ఎస్ శ్రేణులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపునిచ్చారు. ఐదు సార్లు గెలిపించిన మిమ్మల్ని కడుపులో పెట్టుకుని కాపాడుకుంటానని, అన్నగా.. తమ్ముడిగా మీ తోడుంటానని ధైర్యమిచ్చారు. శనివారం వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలకేంద్రాల్లో వేర్వేరుగా నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ నెల 12న కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో నిర్వహించే కదనభేరి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

- గత అసెంబ్లీ ఎన్నిల్లో జరిగిన తప్పిదాన్ని తిప్పికొడుదాం
- పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం
- వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం
- మిమ్మల్ని కడుపులో పెట్టుకుని కాపాడుకుంటా
- అన్నగా.. తమ్ముడిగా మీ తోడుంటా..
- వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట కార్యకర్తల సమావేశంలో కేటీఆర్

సిరిసిల్ల/వీర్నపల్లి/ ఎల్లారెడ్డిపేట, మార్చి 9 : గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆచరణకు సాధ్యం కాని హామీలతో మనం అధికారం కోల్పోయామని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ మోసపోకుండా బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అందుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని కోరారు. కేసీఆర్‌పై ఉన్న కోపాన్ని రేవంత్‌రెడ్డి రైతులపై చూపుతున్నారని మండిపడ్డారు. వంద రోజుల్లో కాంగ్రెస్ సర్కారు గ్యారంటీలను అమలు చేయకపోతే పార్టీకి బొంద తవ్వడం గ్యారంటీ అని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం 4:40 గంటలకు వీర్నపల్లిలో, 6:20 గంటలకు ఎల్లారెడ్డిపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ సర్కారు చేసిన అభివృద్ధిని వివరిస్తూనే.. కాంగెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. 420 హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ఆ పార్టీ పాలనలో పంటలు ఎండుతున్నాయని, ₹2 లక్షల రుణమాఫీ ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ అకుంఠిత దీక్షతో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మిస్తే కూడవెల్లి వాగు ద్వారా వచ్చిన గోదావరి జలాలతో ఎండకాలంలోనూ ఎగువమానేరు మత్తడి దూకిందని గుర్తుచేశారు. మేడిగడ్డలో కుంగిన పిల్లర్లను మాత్రమే ఎత్తిచూపుతున్నారని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే రైతుల మీద ప్రేమతో సాగు నీటి సమస్య లేకుండా చేసేవారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే రైతుల ఆత్మహత్యలు చేసుకోక ముందే కుంగిన పిల్లర్లను మరమ్మతు చేయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో సాగు, తాగునీటికి గోసలేకుండా చేశారని, రైతుబంధు సమయానికి వేసి రైతుల పక్షాన నిలిచారని గుర్తు చేశారు. గిరిజనులకు ఆరు నుంచి 10 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన తప్పిదాన్ని తిప్పికొట్టాలని, పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

### మీ కోసం కష్ట పడుతా..

మానేటి నీటిలో పోరాట పటిమ ఉన్నదని, ఇది విప్లవాల గడ్డ ఎల్లారెడ్డిపేట అని కేటీఆర్ గుర్తు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని, కాలికి బలపం కట్టుకుని మిమ్మల్ని గెలిపిస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో మీరు కష్ట పడాలని.. స్థానిక ఎన్నికల్లో మీ కోసం కష్టపడుతానని భరోసా కల్పించారు. ఐదు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించిన మిమ్మల్ని కడుపులో పెట్టుకుని చూసుకుంటానని, అందరికీ అందుబాటులో ఉంటానని ధైర్యమిచ్చారు. ప్రతి గ్రామాన్ని తానే బాధ్యత తీసుకొని సమావేశాలు నిర్వహించి గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలతో నేరుగా మాట్లాడుతానని చెప్పారు. బూతుల వారీగా, గ్రామాల వారీగా పకడ్బందీగా కష్టపడితే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమష్టి కృషితో కేసీఆర్ బృందాన్ని పార్లమెంట్‌కు పంపే బాధ్యతను కార్యకర్తలంతా భుజాన వేసుకోవాలని కోరారు. కరీంనగర్ జిల్లా ఉద్యమాలకు ఖిల్లా అని, నాడు ఉద్యమ కాలంలో కేసీఆర్‌ను అక్కున చేర్చుకుని 2006 పార్లమెంట్ ఎన్నికల్లో రెండు లక్షల మెజార్టీ అందించిందని గుర్తు చేశారు.

### ఇదేనా మార్పు?

వంద రోజుల్లో కాంగ్రెస్ సర్కారు గ్యారంటీలను అమలు చేయకపోతే పార్టీకి బొంద తవ్వడం గ్యారంటీ అని కేటీఆర్ స్పష్టం చేశారు. కేసీఆర్‌పై ఉన్న కోపాన్ని రేవంత్‌రెడ్డి రైతులపై చూపుతున్నారని మండిపడ్డారు. తాను ఎల్లారెడ్డిపేటకు వస్తున్న దారిలో గుండారం వద్ద నీరు లేక పొలం నెర్రెలతో కనిపించిందని, ఇది కాంగ్రెస్ పాలనకు నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. అలవికాని హామీలు ప్రకటించి కాంగ్రెస్ గద్దెనెక్కిందని, అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు వచ్చాయన్నారు. కరీంనగర్ మున్సిపాలిటీలో రోజూ తాగునీరు సరాఫరా అవుతుండేదని, రానున్న రోజుల్లో రెండు రోజులకు ఒకసారి సరాఫరా చేయాల్సిన పరిస్థితి వస్తుందని, ఇది కాంగ్రెస్ పాలనలో జరిగిన మార్పు అని అన్నారు. ఇటీవల ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లిలో రైతులు తన వద్దకు వచ్చి మానేరు నీటితో చెక్‌డ్యాంలు నింపాలని, అవి నిండితే తమకు దాదాపు 500 ఎకరాలకు సాగునీటికి ఢోకా ఉండదని చెప్పారని గుర్తు చేశారు. కేసీఆర్ ఉంటే తమకు ఈ కష్టం ఉండేది కాదని వారు పేర్కొన్నారని తెలిపారు.



ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ 420హామీల బుక్‌లెట్‌ను చూపుతున్న నాయకులు, కార్యకర్తలు

### ఏం తెల్వనోళ్లు ఏమడుగుతరు?



బండి సంజయ్ ఎంపీగా గెలిచి పార్లమెంటుకు సరిగా పోలేదు. ఎందుకంటే ఏం తెల్వనోళ్లు ఏమడుగుతరు? పొయ్యి ఏం అడుగుతనని పోవుడే బంజేసిండు. గతంలో ఎంపీగా వినోద్‌కుమార్ చేసిన అభివృద్ధి ప్రజలందరికీ తెలుసు. ఆయనను గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ మోటర్లు కాలుతున్నయ్. నీళ్లకు తిప్పలయితంది. మళ్లీ పాత రోజులు వచ్చినయ్. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి పార్లమెంటులో గొంతును వినిపించే మంచి నాయకుడు వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాలె.

- కొండూరి రవీందర్‌రావు, నాఫ్స్‌కాబ్ చైర్మన్

### కొట్లాడి నిధులు తెచ్చే నాయకుడు వినోద్



బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్లనే రాష్ట్రాన్ని సాధించుకున్నం. ఆ మహానుభావుడు చూపిన బాటలోనే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసుకున్నం. సంజయ్ ఈ ప్రాంత అభివృద్ధి కోసం చేసిందేమీ లేదు. పార్లమెంటులో కొట్లాడి నిధులు తెచ్చే నాయకుడు వినోద్‌కుమార్. పార్లమెంటులో అత్యధిక ప్రశ్నలడిగింది బోయినపల్లి వినోద్‌కుమార్ మాత్రమే. అతన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

- తోట ఆగయ్య, బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు

### అభివృద్ధి పట్టని వ్యక్తి ఎంపీ అయ్యిండు



కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో సమస్యలు తెలియని, వాటిని పరిష్కరించని, అభివృద్ధి పట్టని వ్యక్తి ఎంపీ అయ్యిండు. బండి సంజయ్ ఇప్పటి వరకు ఏం చేసిండో చెప్పడం లేదు. మళ్లీ అదే దేవుడి పేరు చెప్పి ఓట్లడిగే ప్రయత్నం చేస్తున్నడు. బోయినపల్లి వినోదన్న మరోసారి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటున్నడు. ఆయన పార్లమెంటుకు వెళ్లడం ప్రజల అవసరం. సిరిసిల్లకు విజన్ ఉన్న నాయకుడు ఉండడం ఇక్కడి ప్రజల అదృష్టం. తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని, 'తెలంగాణ' అన్న వారిపై తుపాకీ గురిపెట్టిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండడం బాధాకరం. ఒక్కనాడు తెలంగాణ పదం ఉచ్చరించని తీరు చూసి బాధ అనిపించింది.

- తుల ఉమ, మాజీ జడ్పీ చైర్మన్

## కదనభేరికి తరలిరండి

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్



ఎస్సారార్‌లో సభా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జీవీఆర్

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 9 : కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో ఈనెల 12న నిర్వహించే కదనభేరి సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. ఈ సభకు వచ్చే వారికి ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ మేరకు శనివారం ఆయన ఎస్సారార్ కళాశాల మైదానాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, సభకు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి లక్షలాది సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారని పేర్కొన్నారు. కరీంనగర్ నుంచి 20 వేలు, మానకొండూర్, హుజూరాబాద్, హుస్నాబాద్, చొప్పదండి, వేములవాడ, సిరిసిల్లల నుంచి 15 వేల చొప్పున ప్రజలు హాజరవుతున్నారని చెప్పారు. కాగా, సభకు వచ్చే ఆయా నియోజకవర్గాల ప్రజలు పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా స్థలాలను గుర్తించామన్నారు. సిరిసిల్ల, వేములవాడ, హుజూరాబాద్, హుస్నాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల నుంచి వచ్చే వాహనాలను సెయింట్‌జాన్స్, సెయింట్ అల్ఫోర్స్ పాఠశాలల్లో, కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల నుంచి వచ్చే వాహనాలను రేకుర్తి ఈద్గా, శుభం గార్డెన్‌లో, అలాగే కార్లు, ఆటోలు, ఇతర చిన్న వాహనాలకు డిమార్ట్ వద్ద పార్కింగ్ స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, పొన్నం అనిల్, శ్రీకాంత్, గందె మహేశ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## మెడిసిన్ ధరలు తగ్గించాలి



మాట్లాడుతున్న వైద్యుడు ఎడవల్లి విజయేందర్ రెడ్డి

- జీఎస్టీ ఎత్తివేయాలి.. నకిలీ, నాసిరకం అరికట్టాలి
- సీనియర్ వైద్యుడు ఎడవల్లి విజయేందర్‌రెడ్డి
- కరీంనగర్‌లో ప్రారంభమైన మెడికల్ రిప్‌ల ఐదో రాష్ట్ర మహాసభలు

కరీంనగర్ విద్యానగర్, మార్చి 9 : మెడిసిన్ ధరలను తగ్గించాలని, వాటిపై జీఎస్టీ ఎత్తి వేయాలని సీనియర్ వైద్యుడు ఎడవెల్లి విజయేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని పద్మశాలీ కల్యాణ మండపంలో తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభల సమావేశాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ దేశ ప్రజల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. మందుల ధరలు తగ్గించాలని, జీఎస్టీ ఎత్తి వేయాలని, నకిలీ, నాసిరకం మందులు అరికట్టాలని, ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిషేధించాలని చేస్తున్న పోరాటాలను కొనియాడారు. అలాగే, ప్రజా సంక్షేమం కోసం మెడికల్ రిప్‌లు చేసే న్యాయమైన పోరాటాలకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి కే వేణుగోపాల్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఖండించారు. ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజంటేటివ్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు కే రమేశ్ సుందర్ మాట్లాడుతూ, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్-1976ను పరిరక్షించాలని, మెడికల్ రిప్రజంటేటివ్స్‌కి చట్టబద్ధమైన పని విధానాలను కల్పించాలని, నాలుగు లేబర్ కోడ్స్‌ని రద్దు చేయాలని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, మందుల రంగంలో జరుగుతున్న అనైతిక కార్యక్రమాలను ఉమ్మడి పోరాటాలతో అరికట్టాలని సూచించారు. మెడికల్ రిప్రజంటేటివ్స్ సమస్యల పరిష్కారం కోసం ఐఎంఏ తరపున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. టీఎంఎస్ఆర్‌యూ జనరల్ సెక్రటరీ రాజు భట్ మాట్లాడుతూ, ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిలిపి వేయాలని, మందులు మందుల పరికరాలపై జీరో శాతం జీఎస్టీ విధించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, కరోనా సమయములో మెడికల్ రిప్స్ ప్రజల కోసం చేసిన సేవలను కొనియాడారు.

## వామ్మో ఎండ

దంచికొడుతున్న భానుడు



అప్పుడే భానుడు ప్రతాపం చూపుతున్నడు. వారం నుంచి ఉదయం తొమ్మిది గంటలకే సుర్రుమంటున్నడు. మధ్యాహ్నంకల్లా మాడు పగులగొడుతున్నడు. మార్చి మొదటి వారంలోనే గరిష్ఠంగా 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, ప్రజలు బెంబేలెత్తుతున్నరు. మధ్యాహ్నం వేళ ఇండ్ల నుంచి బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. - కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

# తులం బంగారం హామీ ఏమైంది?

- ప్రభుత్వం ఎందుకు స్పందిస్త లేదు
- కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు చీరెలిస్తే అడ్డుకోవడం ఏంది?
- జీవన్‌రెడ్డి భార్య, కోడళ్లే చీరెలు కట్టుకోవాల్నా? మాకు వద్దా..?
- ప్రశ్నించిన జగిత్యాల పట్టణ, మండల మహిళలు
- కాంగ్రెస్ నాయకుల తీరుపై ఆగ్రహం.. రోడ్డెక్కి నిరసన
- జగిత్యాలలో రసాభాసగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ
- ప్రొటోకాల్‌పై ఇరుపార్టీ శ్రేణుల మధ్య తోపులాట



రోడ్డుపైకి వచ్చి నిరసన తెలుపుతున్న మహిళలు

జగిత్యాల/జగిత్యాల రూరల్, మార్చి 9: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కల్యాణలక్ష్మి పథకం కింద రూ.లక్షతోపాటు తులం బంగారం ఇంకెప్పుడిస్తారంటూ కాంగ్రెస్ నాయకులను జగిత్యాల పట్టణ, మండల మహిళలు నిలదీశారు. ఇంత వరకు ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు. 'మీరు ఇవ్వరు.. ఇచ్చే వాళ్లను ఇవ్వనివ్వరా..' అంటూ ప్రశ్నించారు. జగిత్యాల రూరల్ తహసీల్ కార్యాలయంలో శనివారం జగిత్యాల అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 303 మంది లబ్ధిదారులకు విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అయితే కేసీఆర్ సర్కారు ఉన్నప్పటి నుంచి ఆడబిడ్డలకు చెక్కులతోపాటు చీరెలను అందించే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, ఇప్పుడు కూడా అలానే ఇవ్వాలనుకున్నారు. ఈ మేరకు తహసీల్ ఆఫీసుకు కొద్ది దూరంలో లబ్ధిదారులకు చీరలు ఇచ్చేందుకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధమయ్యారు. అంతలోనే కాంగ్రెస్ నాయకులు వచ్చి పంపిణీని అడ్డుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చీరెలు ఇవ్వకుండా ఆపేశారు. తర్వాత చీరెలతో ఉన్న వాహనాన్ని అక్కడి నుంచి పంపించారు. దీంతో మహిళలు ఆగ్రహించి, రోడ్డెక్కారు. కాంగ్రెస్ నాయకుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కల్యాణలక్ష్మి సాయంతోపాటు ఇస్తానన్న తులం బంగారం ఇవ్వకపోగా, ఎమ్మెల్యే ఇచ్చే చీరను ఇవ్వకుండా అడ్డుకోవడం ఏంటంటూ కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. మహిళలను ఆడబిడ్డలుగా భావించి గౌరవంతో చీరలు అందిస్తే ఎందుకంత కండ్లమంట? అని నిలదీశారు. 'జీవన్‌రెడ్డి ఇంట్లకెళ్లి ఏమైనా ఇస్తున్నడా..? ఆ చీరెలు ఆయన భార్య, కోడళ్లే కట్టుకోని. మాకేం వద్దు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం తులం బంగారం ఇస్తే, అప్పుడు తాము చీర తీసుకోమని స్పష్టం చేశారు. అయినా ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే ఎలా అడ్డుకుంటారని..? ఇది కాంగ్రెసోళ్ల అత్యుత్సాహమేనని మండిపడ్డారు.

### ప్రొటోకాల్ వివాదం

జగిత్యాల జిల్లా కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ రసాభాసగా మారింది. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతుండగానే.. ప్రొటోకాల్ వివాదం ప్రారంభమైంది. ఫ్లెక్సీలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో తప్ప ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఫొటో ఎందుకు లేదని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ఫొటో లేకపోవడం ఏంటని ఆగ్రహించారు. ప్రతి సారి ఇలాగే చేస్తున్నారని, ఇది సరికాదన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య గొడవ మొదలైంది. విప్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సమక్షంలోనే ఇరుపార్టీల నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వేదిక నుంచి దిగివచ్చి తమతమ పార్టీలకు చెందిన నాయకులను సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది. చివరికి ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ జోక్యం చేసుకొని, ప్రొటోకాల్ విషయంలో కలెక్టర్‌తో మాట్లాడుతానని, తప్పనిసరిగా స్థానిక ఎమ్మెల్యేల ఫొటోలు ఉండేలా చూస్తానని స్పష్టం చేశారు.

### కాంగ్రెస్‌కు ఎందుకంత అక్కసు



పదేండ్ల కేసీఆర్ సర్కార్ పాలనలో ఏనాడూ ఇలాంటి రసాభాస కార్యక్రమాలు లేవు. కాంగ్రెస్ పార్టీ ఎందుకింత అక్కసుతో వ్యవహరిస్తున్నది. తులం బంగారం హామీ విషయం మాట్లాడకుండా చేసింది. ఆడబిడ్డలకు చీరలు ఇవ్వకుండా చేసింది. జగిత్యాల నియోజకవర్గంలో ప్రతిసారి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా ప్రొటోకాల్ వివాదం తలెత్తుతున్నది. కావాలనే ఫ్లెక్సీలపై ఫొటోలు పెట్టడం లేదు.

- డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

### చీరెలను ఇవ్వకుండా చేసుడేంది?

సంజయ్ సారు ఇస్తున్న చీరెలను ఇవ్వకుండా కాంగ్రెసోళ్లు అడ్డుకోవడం విడ్డూరంగా ఉన్నది. జీవన్‌రెడ్డి చీరెలు ఇంట్లకెళ్లి ఇస్తున్నడా? ఆయన భార్య, కోడళ్లే కట్టుకోండ్రి. ఎన్నికల సమయంలో తులం బంగారం అన్నరు కదా. ఇంకా ఇస్తలేరు. కనీసం చీరెలను ఇవ్వకుండా చేసుడేంది?

- భాగ్య, లబ్ధిదారురాలు, సంఘంపల్లి



ఆలయం ఎదుట మొక్కుతున్న భక్తులు

## రాజన్నా.. వెళ్లొస్తాం

వేములవాడ రాజన్న సన్నిధిలో మూడు రోజుల పాటు జరిగిన మహాశివరాత్రి జాతర శనివారం ముగిసింది. దీంతో లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు ఇంటిబాట పట్టారు. రాజన్నా.. వెళ్లొస్తాం అంటూ భక్తులు దండాలు పెట్టి ఇళ్లకు పయనమయ్యారు. దీంతో పట్టణ వీధులన్నీ నిర్మానుష్యమయ్యాయి. - వేములవాడ టౌన్, మార్చి 9

